# వ్యత్యాసం

పైన ఫాను గిర గిర తిరుగుతోంది. కుర్రాళ్ళు వచ్చిన వాళ్ళకి బట్టలు చూపిస్తున్నారు, ఆ కొట్టు కొత్తగా ఓపెన్ అయింది. యజమాని యర్రింరాజు స్ప్రింగ్ ఛైర్‌లో కూచుని ఆలోచనల్లో మునిగిపోయాడు....

దగ్గిర మూడులక్షల పెట్టుబడితో ఆధునికపద్ధతిలో బట్టలకొట్టు ప్రారంభించాడతను. కేవలం బిల్డింగుకే పాతికవేలయ్యింది. 'రాజా టెక్స్‌టైల్స్' అని పేరు పెట్టారు. యిది గతంలో పేరుమోసిన బట్టలషాపు 'కృష్ణా క్లాత్ ఎంపోరియం'ను మించిపోతుందనుకుంటున్నారందరూనూ. అవునుమరి....అనుకోరూ. చాలా జనం తనకొట్టుకే తిరుగుతున్నారు. తెరిచి రెండు నెల్లయినా కాలేదు, ఎకౌంటుల్లో ముప్ఫైవేలపైన లాభాలు కనిపిస్తున్నాయి. ఎంతలేదన్నా ప్రతీనెలా పదిహేను వేలయినా మిగలకమానదు. యీ ఏడాది గడవనిచ్చి వీలుచూసుకొని, ఓ సినిమా హాలు కట్టించడం మంచిది. ఒక పెద్దహాలు....మోడరన్ ఫాషన్‌లో.... లక్షయినా సరే ఖర్చుచేసి కట్టించెయ్యాలి. దానివల్ల యెక్కువ లాభాలు వస్తాయి. యిక తన ఆస్తి అలా....అలా....

వందరూపాయిల కాయితం కనిపించి ఆలోచన్లు ఆగాయి. తీసుకున్న వాటికి బిల్లు రాశాడు, ఎక్కౌంటు గుమస్తా. తను నోటు తీసుకొని చిల్లర యిచ్చేశాడు.

ఎత్తుగా, సొరుగులో చేతికితగిలిన నోట్లకట్ట ...అలా అలా పెరిగి....సినిమా హాలంతయింది, యర్రింరాజు మనసులో. ......

ముకుందంరాసిన కథొకటి ఈ నెల "భారతి"లో అచ్చయింది-అమాంతంగా. దానికి పారితోషికంగా ఇవ్వాళ ముఫ్ఫయిరూపాయిల మనియార్డరొచ్చింది. పోస్టుమానిచ్చిన మూడుపదిరూపాయిల కాగితాలు పట్టుకుని అలాగే కుర్చీలో కూర్చుండిపోయాడు....కరెన్సీ రెప రెప లాడుతుంటే ... ఊహలు మేఘాలు దాటాయి.

తను రాసిన కథలు అచ్చుగావటం, యిది మొదటిసారేంగాదు. యింతకు ముందు నాలుగయిదుసార్లు వివిధ పత్రికల్లో అచ్చు అవనే అయినాయ్. మొన్నొక రోజున తన స్నేహితుడు చంద్రిరావు, తనురాసిన కథ చదివి మెచ్చేసుకుని, నీ కథలు 'గోపీచంద్' ఫక్కీలో వుంటాయి. నీకు ఉజ్వల భవిష్యత్తుంది అనేశాడు తనని అందరూ ఆదర్శప్రాయంగా తీసుకుంటారు. తన సాహిత్యం తర తరాలు, చిరకాలం వర్ధిల్లిపోతుందిగామోసు.

ముకుందం మొన్నే ఒక నవల రాయడం ప్రారంభించాడు. కొంతవరకూ వచ్చింది. దానికి "ఆశాకిరణం"అని పేరు పెడదామనుకుంటున్నాడు. ఆ పుస్తకం నిజంగా తెలుగు సాహిత్యం పాలిటి–'ఆశాకిరణం' కాగలదు. అది దబ్బున పూర్తి చేసి, ఏ'దేశి కవితామండలి' వారికో ఇవ్వడం మంచిది. వీలయితే 'గోపిచంద్' గారిచేత పరిచయ వాక్యాలు రాయించుకోవాలి....అఁ ...

ముకుందం గబ గబా, సగం రాసిన సగం రాసిన నవల తాలూకు కాయి తాలు తీసి రాయడం ప్రారంభించాడు.

మనసులో గోపిచంద్ పుస్తకాలు బైండ్లు,బైండ్లుగా... వరసగా .. మెరుస్తో కనిపిస్తూ ...కదులుతున్నాయి.........

రంగమణి, రాజారావుకేసి చూసింది. ఇద్దరిది ఒకే క్లాసు. యింతకుముందు చాలాసార్లు చూసింది అతనికేసి. రాజారావుతో రెండు మూడుసార్లు మాట్లాడింది కూడాను–ముందుగా రావు పలకరిస్తేనే ననుకోండి....

ఆ అదును తీసుకుని రాజారావు రంగమణిని ప్రేమించడం ప్రారంభించాడు రోజుకు తనకేసి ఎన్నిసార్లు చూస్తుందో లెక్కపెట్టుకుంటున్నాడు. రంగమణి కూచునే బెంచీకెదురుగా కూచుంటాడు రాజారావు.

తనని చూసి ఏదో ప్రేమచేతనే గామోసు, సిగ్గుపడిపోయింది అనుకుంటాడు తను కనిపించగానే ఆమెమొహం తిప్పుకోవడాన్ని చూసి. అదంతా సెంట్ పర్సంట్ లవ్ అని అతని ఉద్దేశ్యం. వాళ్ళ నాన్న కమ్యూనిస్టట! చాలా....చాలా....మంచి వాడట. ఒకసారి ఆయన ఒక సభలో కులాంతర వివాహాల గురించి మాట్లాడం విన్నాడు, రాజారావు.

"రంగమణి లేకపోయిందిగాని పక్కన, లేకపోతే 'మీ అమ్మాయిన్నేను చేసేసుకుంటున్నానండోయ్ పెళ్ళి' అని తప్పకుండా చెప్పేద్దును" అనుకున్నాడు

....'మొన్న మీరుచెప్పిన నోట్సు రాసుకోలేదు' అన్నది రంగమణి, లేపాక్షిరావుతో, రాజారావు వింటూండగానే.

"అలాగా .మిస్టర్ రాజారావ్, మీరు రాసినట్టున్నారు గదూ ...రేపు మీ నోట్సు ఒకసారి ఈమెకివ్వండి" అన్నాడు లేపాక్షిరావు, రాజారావునుద్దేశించి.... రాజారావు కాలరెత్తాడు.

ఆ రోజు రాత్రి రాజారావుకు, తనకీ రంగమణికీ పెళ్ళయినట్టూ, ఇద్దరూ హనీమూన్‌కు వెళ్తున్నట్టు....కల .......

అప్పలకొండ రామకృష్ణా సా మిల్స్‌లో ఓ కూలీ, చమటలుకారేలా పనిచేస్తు న్నాడు. వంటి నిండాదుమ్ము. బలంగా–గుండ్రంగా–కదిలే కండలూ, సాయంత్రం

ఇంటికొచ్చి నూతిదగ్గర స్నానంచేస్తాడు ఆలోచనల్లేని మనస్సుతో హాయిగా గడిపేస్తాడు. మిరపకాయ కొరుక్కుని, అంబలితాగి, చాపమీద నూరితో, పడుకుంటాడు తలలో....కార్ఖానాలు, కర కర తెగిపోయే దూలాలు, దుమ్ము కొట్టిన వొళ్ళతో తోటి కూలీలు....గజి బిజిగా గోల....!కొత్తగా ప్రారంభించిన 'రాజాటెక్స్‌టైల్స్'లో రాత్రి దొంగలుపడి వుత్త బీరువాలు వదిలేశారు. వాటిని యర్రింరాజు వేలం వేస్తున్నాడు, ఏడుస్తో పాట దగ్గిర నిలబడిపోయాడు.

ముకుందం రాసిన కథలు ఈ మధ్య తిరుగు పోస్టులో వచ్చేస్తున్న సంగతీ ఆ మర్నాటినుంచీ రంగమణి కనిపించక రాజారావు క్షవరం మానేసిన సంగతీ అప్పలకొండకి తెలీదు....తెలుసుకునే అవసరమూ, అర్హతా, అతనికి లేవు..... ఆ నెలనుంచీ కూలీలందరికి జీతం మూడురూపాయిలు పెంచుతున్నారన్న సంగతి మాత్రం సాయంత్రం తెలిసింది. దాన్ని అతడు ఊహించుకోలేదు....హుషారుకు పట్ట పగ్గాల్లేవు. మూడు దూలాలు కలిపి దాటేశాడు. రాత్రికి నూరిని గాలిలో ఎగరేసి పట్టుకున్నాడు. మామూలుగా అంబలి తాగేసి. కూనిరాగాలు ప్రారంభించాడు. దూరం నించి వేలంపాటు కేకలు వినిపిస్తూన్నాయ్ యింకా.

రచన : జూలై 1961; ప్రచురణ : చూక్కాని, 1-8-1961